అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ దూదిబావిలోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథులుగా బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుని భావితరాలకు వారి స్ఫూర్తిని అందించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సింగారపు నరేశ్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ప్రోగాంలో నాయకులు కందాడి నాగేశ్వర్ రెడ్డి, మహేశ్, రాజేశ్ నాయర్, గణేశ్, అనూష తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన

సికింద్రాబాద్: వారాసీగూడ జాన్సన్ గ్రామర్ స్కూల్ విద్యార్థులకు షీ టీం బృందాల కార్యక్రమాలు, మహిళల సంరక్షణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం ఏసీపీ ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ బాలికలు అపరిచితులకు దూరంగా ఉండాలన్నారు. అలాగే వారి నుంచి ఎదురయ్యే అత్యవసర పరిస్థితుల నుంచి ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. ప్రమాదకర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం డయల్ 100, 1098 నంబర్లకు ఫిర్యాదు చేశాయని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు శ్రీహరి, ప్రవీణ, ప్రధానోపాధ్యాయులు వీణ, పుష్ప, షీటీం ప్రతినిధులు నర్సింగరావు, ఉమామహేశ్వర్‌రావు, మనీషా, రాజశేఖర్, శిరీష పాల్గొన్నారు.

'బీసీ అధికారులకు ప్రాధాన్యం లేని శాఖలు'

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ అధికారులకు ప్రాధాన్యం లేని శాఖల కేటాయింపుపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. రెండు, మూడు కులాల వారికే ప్రాధానతనిచ్చి ముఖ్యమైన శాఖలు కేటాయించి బీసీలను విస్మరిస్తూ సీఎం రేవంత్ రెడ్డి సవతి తల్లి ప్రేమ చూపడం సరికాదన్నారు. రాష్ట్రంలో మెజార్టీ ఉన్న బీసీలను గుర్తించి భవిష్యత్‌లో జరిగే బదిలీల్లో సామాజిక న్యాయం పాటించాలని లేకుంటే రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

దేవాదాయ క్లర్క్‌కు వీడ్కోలు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని వీరాంజనేయ దేవస్థానం క్లర్క్ జగపతికి స్థానిక ప్రతినిధులు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. 17 ఏళ్లుగా ఆలయానికి విశిష్ట సేవలు అందించి ఆలయ ప్రగతికి కృషి చేసినందుకు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చందర్, ధర్మకర్త కైలాస్ అరుణ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎంపీ నామ్‌దేవ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పొద్దుటూరి వెంకటేశ్వర్‌రావు (బాబు), అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బేగంపేట డీఐగా మధుసూదన్‌రెడ్డి

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ డీఐగా మధుసూదన్‌రెడ్డి అరకలకు బాధ్యతలు అప్పగిస్తూ నగర సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. రెయిన్‌బజార్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

లలిత కళలపై మరిన్ని పరిశోధనలు జరగాలి

ఉస్మానియా యూనివర్సిటీ: భారతీయ సంస్కృతిలో భాగమైన శాస్త్రీయ సంగీతం, నృత్యరీతులు లలిత కళలపై మరిన్ని పరిశోధనలు జరగాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్.కేవీ రమణ చారి అన్నారు. ఓయూ క్యాంపస్ ఆంధ్రామహిళా బీఈడీ కాలేజీలోని ఆడిటోరియంలో నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో గాంధర్వం-2, సాధనతో సాధ్యం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీస్ అండ్ అకౌంట్ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర అధ్యక్షత వహించగా డాక్టర్. కేవీ రమణచారి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గాంధర్వం-2 పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవ్య నాటక అకాడమీ చైర్మన్ యూవీఎల్ ఆనంద, అధ్యక్షుడు వి.వి జయ కుమార్, స్నేహ రాంచందర్, మధుమతి కులకర్ణి, ఎం.లక్ష్మీమానస, రేణుక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

25న మహనీయుల జాతరను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 25న జరిగే మహనీయుల జాతరను విజయవంతం చేయాలని సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొ.ప్రభంజన్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో మహనీయుల జాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న రవీంద్ర భారతీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే మహ నీయుల జాతర కార్యక్రమంలో ఆట, పాట, మాట బహుజన సాంస్కృతిక ఉద్యమం ఘట్టాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, పలు పార్టీల మాజీలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరు కానున్నట్లు తెలిపారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బహుజనుల రాజ్యాం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టిన్న ట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు, విద్యావంతులు, మేధావులతో పా టు తెలంగాణ విద్యార్థి ఉద్యమ నేత కంచర్ల బద్రి, కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక అధ్యక్షుడు చక్రాల రఘు, విద్యార్థి నాయకులు వీరన్న నాయక్, ఉపేందర్, ఆర్టీసీ విశ్రాంత ఈడీ కొమరయ్య పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

రాంగోపాల్‌పేట్: ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్తూ తప్పించుకుని తిరుగుతున్న ఓ దొంగను గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్నే భగత్ ఈ నెల 7వ తేదీన ఇస్కాన్ దేవాలయానికి వచ్చాడు. లోనికి వెళ్లి వచ్చే సరికి తన బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా సిద్దిపేటకు చెందిన రత్నాకర్‌రెడ్డి (34)గండిమైసమ్మ ఆలయం వద్దకు రాగానే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసికున్నారు. నిందితుడిపై దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో మరో కేసు కూడా నమోదై ఉంది.

సెక్యూరిటీ గార్డ్ ఇంట్లో చోరీ

సనత్‌నగర్: సెక్యూరిటీ గార్డ్ ఇంట్లో చోరీ ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రసూల్‌పురా సీబీఎస్‌నగర్‌లో నివసించే కనకయ్య సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత నెల 30న తన తల్లి మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు స్వస్థలం సిద్దిపేటకు వెళ్లారు. అనంతరం ఈ నెల 4న ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లోని వస్తువులను సర్ది, ఇల్లు శుభ్రం చేసి మళ్లీ సిద్దిపేటకు వెళ్లిపోయారు. తిరిగి శనివారం ఉదయం సీబీఎస్‌నగర్‌లోని తన ఇంటికి వచ్చి చూడగా గేటు తాళం పగులగొట్టి ఉంది. గమనించి లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 50 తులాల వెండి, 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.5 వేలు కనిపించలేదు. దీంతో కనకయ్య బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం అక్కడికి చేరుకుని ఫింగర్ ప్రింట్స్, ఇతర ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ముస్తాబైన బోయిగూడ నల్లపోచమ్మ, ముత్యాలమ్మ ఆలయం

రైల్ కళారంగ్ బస్తీలో..

బోనాలకు వేళాయె..

- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- రెండు రోజుల పాటు నిర్వహణ
- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న ఫలహారపు బండ్ల ఊరేగింపు

నేటి నుంచి బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో షురూ

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో నేటి నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 11 ఆదివారం బోనాలు, 12 సోమవారం గావు, రంగం కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే బోయిగూడ నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ, చాచానెహ్రూనగర్‌లోని నల్లపోచమ్మ, బోయిగూడలోని ఉప్పలమ్మ, ఐడీహెచ్ కాలనీ, రైల్ కళారంగ్ బస్తీ, గాంధీనగర్, న్యూబోయిగూడ, గొల్లకొమురయ్య కాలనీలోని అమ్మవారి ఆలయాలను రంగు రంగుల పువ్వులతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు వెంకయ్య, బలరాం, రవికుమార్, వై. సురేశ్, ప్రభాకర్, రమేశ్ పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఫలహారపు బండ్ల ఊరేగింపులు..

బోనాల వేడుకల్లో భాగంగా అమ్మవారి ఫలహారపు బండ్ల ఊరేగింపు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బన్సీలాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డీ క్లాస్ బండమైసమ్మ దేవాలయం, ఐడీహెచ్ కాలనీ, భోలక్‌పూర్ తదితర ప్రాంతాల నుంచి అమ్మవారి ఫలహారపు బండ్లను డప్పుచప్పుళ్లు.. పోతరాజుల నృత్యాల మధ్య పెద్ద ఎత్తున వీధుల్లో ఊరేగిస్తారు.

ప్రముఖుల రాక..

బోనాల ఉత్సవాల సందర్భంగా రాజకీయ ప్రముఖులు, అధికారులు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఆయన తనయుడు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పటిష్ట బందోబస్తు : ఇన్‌స్పెక్టర్ రాజు

గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో జరిగే అమ్మవారి బోనాల ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. దేవాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. మహిళలకు భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేసే వ్యక్తులు, శక్తులపై కఠినంగా వ్యవహరిస్తాం. ఎక్కడ ఎలాంటి సమస్యలు.. ఇబ్బందులు ..గొడవలు ఉత్పన్నమైన వెంటనే ప్రజలు 87126 61248 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

దోపిడీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి



రికవరీ చేసిన నగలు చూపిస్తున్న పోలీసులు

అడ్డగుట్ట: దోపిడీలకు పాల్పడుతున్న దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు లాలాగూడ పోలీసులు. లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లాలోని త్రిపురారం మండలం చెన్నైపాలెంకు చెందిన నేనావత్ హరి నాయక్ (45) కొంత కాలం క్రితం నగరానికి వలస వచ్చాడు. అనంతరం, వడ్డేపల్లి లక్ష్మి (40) అలియాస్ కవిత అనే మహిళతో పరిచయం ఏర్పడి సహజీవనం సాగిస్తున్నాడు. హస్తినపురంలోని రాఘవేంద్ర హోటల్ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన వీరు ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ దోపిడీలు చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆగస్టు 3న సాయంత్రం 6 గంటలకు అత్తాపూర్‌లోని ఒ కల్లు కంపౌండ్‌కు వెళ్లిన ఈ దంపతులు అక్కడ ఒంటరిగా ఉన్న అచ్చమ్మ అనే మహిళతో మాట కలిపారు. పని ఇప్పిస్తామని చెప్పి అచ్చమ్మను ఆటో ఎక్కించుకొని నార్త్‌లాలాగూడలోని రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయం సమీపంలోని మహంకాళి ఆలయం వద్దనున్న ఖాళీ ప్రదేశానికి తీసుకుచ్చారు. అనంతరం, అచ్చమ్మను చంపేస్తామని బెదిరించి ఆమె నల్లపూసలు, బంగారు గొలుసు, చెవి కమ్మలు, ముక్కుపుడక, మెట్టెలు (మొత్తం రూ. 30 వేల విలువైన 12 గ్రాముల బంగారు నగలు, 3 తులాల వెండి ఆభరణాలు) లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అత్తాపూర్ నుంచి లాలాగూడ పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న సీసీ కెమెరాల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దొంగిలించిన సొత్తును సికింద్రాబాద్ పాట్ మార్కెట్లోని శ్రీ స్వతంత్ర జ్యువెల్లర్స్, శ్రీ లక్ష్మీనారాయణ జ్యువెల్లర్స్ యజమానులు సంజయ్ ఉపాధ్యాయ్, ప్రవీణ్‌కుమార్‌కు విక్రయించినట్లు గుర్తించారు. వారి వద్దకు వెళ్లి విచారించి శనివారం ఉదయం క్రైం ఎస్ఐ నాగరాజు నేతృత్వంలో పలువురు కానిస్టేబుళ్లు నిందితులు హరి నాయక్, వడ్డె లక్ష్మిని హస్తినపురంలోని నందనవనం కాలనీలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 7 గ్రాముల బంగారు నగలు, 23 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగలించిన సొత్తును కొనుగోలు చేసిన జ్యువెల్లరీ షాపు యజమానులపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు హరి నాయక్‌పై 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఏడు పోలీస్ స్టేషన్లలో 10కి పైగా కేసులు నమోదు అయినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎస్ఐలు నాగరాజు, షాహీద్ పాషా, క్రైం టీమ్ రాజశేఖర్, సుమంత్, సాయినాథ్, జగదీష్, నవీన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడిన భార్యాభర్తలు

- చికిత్స పొందుతూ భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

రాంగోపాల్‌పేట్: నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై పనిచేస్తున్న భార్యాభర్తలు ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. ఈ ఘటనలో భర్త మృతి చెందగా, భార్య తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన సంబంధించి పోలీసుల వివరాల ఇలా ఉన్నాయి.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బైరాగి (56), లక్ష్మి (45) భార్యాభర్తలు. 5 ఏళ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చి ఆవులమందలో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ వద్ద రెజిమెంటల్‌బజార్‌లోని ఓ నూతన భవనం నిర్మాణంలో కూలీలుగా పనిచేస్తున్నారు. గురువారం ఈ భవనం స్లాబ్ పనులు జరుగుతుండగా భార్య మాల్ అందిస్తుండగా భర్త అందుకుంటున్నారు. సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఇద్దరూ ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బైరాగి మృతి చెందాడు. లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్, ఇంటి యజమాని నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లిన దొంగల అరెస్టు

రసూల్‌పురా: ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లిన ముగ్గురి నిందితులను కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి హోండా యాక్టీవాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లికి చెందిన ఇర్ఫాన్‌ఖాన్ (24), ఎండీ అజర్ (25)ఆగాపురాకు చెందిన ఎండీ ఇమ్రాన్‌ఖాన్(26) తమ హోండా షైన్‌పై గత నెల 29న కార్ఖాన పీఎస్ పరిధిలోని అస్బెస్టాస్ కాలనీకి వచ్చారు. అక్కడే ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన హోండా యాక్టీవా (టీఎస్ 10 ఈఎం 8955) ఎత్తుకెళ్లారు. దీంతో యాక్టీవా యజమాని అబ్దుల్ వాహెబ్ ఖాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి ముగ్గురుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఏబీవీపీ కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఏబీవీపీ నూతన కమిటీని శనివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా సంపత్‌కుమార్, కార్యదర్శిగా రాహుల్, ఉపాధ్యక్షులుగా శృతి, జాయింట్ సెక్రెటరీగా అక్షయ, పూజితతో పాటు 30 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్లు కన్వీనర్ తోట శ్రీనివాస్ తెలిపారు. స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, సభ్యులు కమల్ సురేష్, రాజు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై అపోహలు వద్దు



వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో గురువారెడ్డి తదితరులు

సనత్‌నగర్: వ్యాక్సిన్లపై అపోహలు వద్దని, దానిపై మరింత అవగాహన పెంచాలని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ, చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి అన్నారు. బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ దవాఖానలో పెద్దవారు (అడల్ట్) కోసం వ్యాక్సినేషన్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దవారు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లు తీసుకునేలా వైద్యులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలతో పాటు లంగ్స్, సీఓపీడీ, ఆస్తమా సమస్యలు పెరుగుతున్నాయన్నారు. అలాగే కేన్సర్‌తో బాధపడుతున్న వారు ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అయినవారికి రోగ నిరోధక శక్తి తక్కువ ఉంటుందన్నారు. ఇలాంటి వారు రెగ్యులర్‌గా వ్యాక్సినేషన్ తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. న్యూమోనియా, ఇన్ఫ్లూఎంజా, టీటీ, టీడీఏపీ, టెటినస్, హెపటైటిస్ బీ, సింగిల్స్ వంటి అడల్ట్ ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే ప్రజల్లో వ్యాక్సిన్లపై ఉన్న అపోహల కారణంగా వాటిని తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్‌బాబు, డాక్టర్లు శిరీష్, స్వాతిరెడ్డి, ప్రశాంత్‌కుమార్, నవవికాస్, సుధాకర్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్ మహీంద్రా అకాడమీ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

సనత్‌నగర్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద టెక్ మహీంద్రా ఫౌండేషన్‌కు చెందిన టెక్ మహీంద్రా అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పువ్వుల దీప్తి తెలిపారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో శిక్షణ వివరాలను శనివారం ఆమె వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు ఆయా కోర్సుల్లో స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎంతో డిమాండ్ కలిగిన 'సప్‌లై చైన్ మేనేజ్‌మెంట్', 'వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్'ల శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్ అవకాశం కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన 19 నుంచి 28 ఏళ్ల లోపు వయస్సు గల యువత ఆయా కోర్సుల్లో చేరవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 73373 32606 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఓయూ విద్యార్థుల బైక్ ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఇందిరా పార్కు వద్ద శనివారం చేపట్టిన సత్యాగ్రహ దీక్షల్లో పాల్గొనేందుకు ఓయూ నుంచి విద్యార్థులు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. విద్యార్థి జేఏసీ చైర్మన్ అశోక్‌యాదవ్, టీఎస్‌పీ అధ్యక్షులు బారి అశోక్‌కుమార్‌యాదవ్, శ్రవణ్, శరత్‌యాదవ్, జక్కుల మధు, సాయినేత, రవిమాదిగ, నూ కల మధుయాదవ్, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

'అక్రమ ప్రమోషన్లపె మౌనం వీడాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సీనియర్ ప్రొఫెసర్ల అక్రమ ప్రమోషన్లపై మౌనం వీడాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు నెల్లి సత్య శనివారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కోరారు. ప్రమోషన్ల అక్రమాలపై నియమించిన ప్రొ.తిరుపతిరావు కమిటీ నివేదికను ఇంకెప్పుడు బహిర్గతం చేస్తారని ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ఆత్యా టెక్నాలజీస్' సేవలు ప్రశంసనీయం



కార్యక్రమంలో పాల్గొన్న ఐఐటీ డైరెక్టర్ ప్రొ టీఎన్ సింగ్

లాలాపేట: మేకిన్ ఇండియాలో భాగంగా నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఆత్యా టెక్నాలజీ చేస్తున్న కృషిని ఐఐటీ పాట్నా డైరెక్టర్ ప్రొఫెసర్ టీఎన్ సింగ్ ప్రశంసించారు. ఆత్యా టెక్నాలజీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇండస్ట్రియల్ సెన్సర్‌తో కూడిన ఐఓటీ కిట్‌ను ఆవిష్కరించారు. దీంతో పాటుగా ఐఐటీ పాట్నా టెక్నికల్ ఇన్నోవేషన్ హబ్ సహకారంతో నిర్వహిస్తున్న పలు నూతన కోర్సులు ఐఓటీ, పీసీబీ డిజైన్, సైబర్ సెక్యూరిటీ, ఎంబడెడ్ అండ్ డెటా సైన్స్ ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్యా టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన ఇండస్ట్రియల్ సెన్సార్ ఐఓటీ కిట్‌లు ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పారిశ్రామిక ఆటోమేషన్ రంగంలో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాన్ని కలిగించేందుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఆత్యా టెక్నాలజీస్ డైరెక్టర్ శ్రీనేష్ ఠాకూర్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

సనత్‌నగర్: పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ జయప్రకాశ్‌నగర్‌లో శనివారం నిర్వహించిన వన మహోత్సవంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు జ్యోత్స్న, సంధ్య, కైలాష్, మూర్తి, బీఆర్ఎస్ నేత కొలను బాల్‌రెడ్డి, కాలనీవాసులు దాసు, సాయినాథ్‌రెడ్డి, గీత పాల్గొ న్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

సికింద్రాబాద్: డీలర్లు రేషన్ సరుకులను సక్రమంగా అందించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సూచించారు. డివిజన్ పరిధిలోని రేషన్ షాపులను శనివారం పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి సరకులు పంపిణీ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.



ఆకట్టుకున్న 'కళా ఉత్సవ్'

సనత్‌నగర్: సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్‌లో ఫౌండర్ ట్రస్టీ మల్లేశ్‌గుప్తా స్మారకార్థం పేరిట నిర్వహించిన 'కళా ఉత్సవ్' ఆకట్టుకున్నది. నగరంతో పాటు శివారు ప్రాంతాలకు చెందిన 29 పాఠశాలల విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక వైభవాన్ని చాటారు. సందేశాత్మకంగా ప్రదర్శించిన నృత్యాలు ఓలలాడించాయి. పోటీల్లో ప్రగతినగర్ ప్రగతి సెంట్రల్ స్కూల్ మొదటి బహుమతి గెలుచుకోగా, డీఏవీ స్కూల్ ద్వితీయ బహుమతిని సాధించింది. విజేతలకు వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ట్రోఫీలు, మెమొంటోలను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు చంద్రకళాయాదవ్, హెచ్ఎన్ త్రిపాఠి, సూర్యనారాయణ, చంద్రశేఖర్‌గుప్తా, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ స్వీకరించిన అశోక్ యాదవ్



డాక్టరేట్ అందుకుంటున్న కొమ్ము అశోక్‌యాదవ్

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ గ్లోబల్ అసోసియేషన్ జర్మనీ యూనివర్సిటీ నుంచి సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ మేరకు శనివారం పుదుచ్చేరి పట్టణంలోని ఓ హోటల్‌లో యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సమావేశంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి ఆ యూనివర్సిటీ చైర్మన్, ఇండియన్ ఆర్మీ రిటైర్డ్ డాక్టర్ సుబ్బయ్య చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. కొన్నేళ్లుగా సమాజ సేవలో రాణిస్తూ వృద్ధాశ్రమాల్లో దుప్పట్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, కరోనా విపత్కార పరిస్థితుల్లో దాదాపు 15 వేలకు పైగా మందికి రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. అలాగే సహకార సంఘాల ఏర్పాటు, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఇందుకుగాను డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

విగ్రహాల శుద్ధి

బౌద్ధనగర్: స్వాంతత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బీజేపీ పిలుపుమేరకు స్వతంత్ర సమరయోధులు, మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని డివిజన్ అధ్యక్షుడు హనుమంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హాజరై మహాత్మా గాంధీ, అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుభ్రం చేసి పాలాభిషేకం చేశారు. అనంతరం, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మేకల కీర్తి, హర్ష కిరణ్, సత్యనారాయణ, విశ్వనాథ్, రాజ్‌కుమార్, కుమార్, శ్యామ్ రాజ్, కొమురయ్య, నాగరాజు, సుబ్బారావు, వనమాల శ్రీనివాస్, దేవేందర్, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

లాలాపేట: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్టీల్లో వెంటనే ఏబీసీడీ వర్గీకరణ చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు డిమాండ్ చేశారు. ఓ హోటల్‌లో తెలంగాణ ఆదివాసీ, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకుల సమావేశం శనివారం జరిగింది. పలువురు ప్రొఫెసర్లు, మేధావులు, ఉద్యోగులు, 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి రూ 1000 కోట్లు బడ్జెట్ కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం లోకిని రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, కమిటీ సభ్యులను నియమించాలన్నారు. బ్యాంక్‌లతో సంబంధం లేకుండా 100 శాతం సబ్సిడీపై రూ 10 లక్షల రుణం అందించాలని కోరారు. ఏకలవ్య స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని, ట్యాంక్ బండ్‌పై ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. శ్రీరామ్ సదానందం, కుతాడి రవికుమార్, కోనేటి నర్సింహ, వనం రమేశ్, నాగులు, ఆనంద్, రాజు, రాజశేఖర్, సమ్మయ్య ఉన్నారు.